క్లుప్తంగా

పథకాల అమలులో అలసత్వం తగదు

- డ్వామా పీడీ సలీం బాషా


మాట్లాడుతున్న డ్వామా పీడీ సలీం బాషా

కళ్యాణదుర్గం: సంక్షేమ పథకాల అమలులో అలసత్వం తగదని డ్వామా పీడీ సలీం బాషా అన్నారు.శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం సూపరింటెండెంట్ శైలజ, ఏపీడీ రమేష్ నాయక్, డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, హౌసింగ్ డీఈ విజయశేఖర్ రావుతో కలిసి ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం ద్వారా అమలవుతున్న ఉపాధి పనులు, ఇంటి నిర్మాణాలు, గోకుల షెడ్ల పురోగతిపై ఆరా తీశారు. గోకులం యూనిట్ల పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామచంద్రతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన

బెళుగుప్ప: మండల కేంద్రం పరిసరాల్లో చేస్తున్న ఉపాధి పనులను డ్వామా పీడీ సలీంబాషా శనివారం పరిశీలించారు.ఉపాధికూలీలతో పీడీ మాట్లాడారు. ఉపాధి పనులకు వెళ్లి పనిదినాలను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఏపీడీ సూర్యప్రకాశ్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులు మురళీకృష్ణ పాల్గొన్నారు.

యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్‌పై అవగాహన


విద్యార్థులతో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని బ్యాడ్రహళ్లి, పట్టణంలోని నార్త్ స్కూల్‌లో పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ శ్రీవివాస్ గుప్త ఆధ్వర్యంలో యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 24 వరకు యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్‌పై వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నార్త్ స్కూల్ హెచ్‌ఎం గాయిత్రి, బ్యాడ్రహళ్లి హెచ్‌ఎం కుళ్లా యప్ప, పశువైద్యాధికారి రమేష్, ఫిజికల్ డైరెక్టర్ కిరణ్ చౌదరి పాల్గొన్నారు.

26న కలెక్టరేట్ వద్ద ధర్నా

కూడేరు: కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 26న జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి తెలిపారు. శనివారం ఆయన కూడేరులో విలేకరులతో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకొచ్చినప్పటి నుంచి రైతాంగం, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. దీంతో రైతులు, కార్మికులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ధర్నాకు సంబంధించిన కరపత్రాలను అందజేశారు. సీపీఎం నేతలు కరీం సాబ్, నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

మరిన్ని ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ఉరవకొండ: పట్టణంలో ఆధార్ సెంటర్లు అదనంగా ఏర్పాటు చేసి విద్యార్థులకు అపార్ కష్టాలు తొలగించాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు సిద్ధార్థ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన అపార్ కార్డుల జారీతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఇబ్బందులు తప్పలేదన్నారు. అనంతరం డీటీ బోగన్నగౌడ్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు నందు, హిరణ్య, నాయకులు సాయి, ప్రవీణ్, చరణ్, మల్లి, శివ, చిరు, నాని, ఛత్రపతి పాల్గొన్నారు.

బెస్తలకు కేటాయించిన భూమిపై దౌర్జన్యం తగదు


స్థలాన్ని చదును చేస్తున్న జేసీబీని అడ్డుకున్న బెస్త సంఘం నాయకులు

రాయదుర్గంటౌన్: బెస్తలకు కేటాయించిన భూమిలో అయ్యప్పస్వామి దేవాలయ నిర్మాణం కోసం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు స్థలం ఇచ్చారని దౌర్జన్యం చేయడం సరికాదని బెస్త సంఘం నాయకులు కమలమ్మ, రాము, శివకుమార్, గోవిందరాజులు నిరసన తెలియజేశారు. గొల్లపల్లి రోడ్డు సర్వే నెంబర్ 110ఏ లోని కొండపోరంబోకు 50 సెంట్ల స్థలం కేటాయించింది. అందులోని 12 సెంట్లలో బెస్తల సమాధులు కూడా ఉన్నాయి. అయితే శనివారం కొందరు జేసీబీ తెచ్చి సదరు స్థలాన్ని చదును చేస్తుండగా బెస్తలు అడ్డుకుని అధికారులకు ఫిర్యాదు చేశారు. గత 20న ఇదే విషయమై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామని, ఇప్పుడు దౌర్జన్యంగా చదును చేస్తున్నారని, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బెస్త సంఘం నాయకులు అనఅన్నారు. ఇదిలా ఉండగా వివాదాస్పద స్థలంలోనే ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆలయానికి స్థలం ఇచ్చినట్లు బోర్డు నాటడం విశేషం . తహసీల్దార్ నాగ రాజు మాట్లాడుతూ అది కొండపోరంబోకు స్థలమని, ఎవరికి కేటాయించలేదన్నారు. క్షేత్రస్థాయిలో స్థలాన్ని పరిశీలించి, చర్యలు తీసుకుంటామ న్నారు.

ధరలు లేక రైతు కుదేలు

- పడిపోయిన ధాన్యం, వేరుశనగ ధరలు
- పెట్టుబడి కూడా దక్కలేదని రైతుల ఆవేదన


ఎస్.హొసళ్లి సమీపంలో తొలగించిన వేరుశనగను ఇంటికి తరలిస్తున్న రైతు

గుమ్మఘట్ట: ఈసారి పంటకు గిట్టుబాటు ధరలు లేక రైతులు కుదేలయ్యారు. ఖరీఫ్‌లో ఈ ఏడాదైనా పంటలు బాగా పండుతాయని రైతులు వేరుశనగ, వరి, మొక్క జొన్న పంటలు సాగు చేశారు. తీరా చేతికంది వచ్చిన తర్వాత వాటిని తొలగించి, మార్కెట్‌కు తీసుకెళ్లేలోపు ధరలు పడిపోయాయి. దీంతో రైతుకు దిక్కుతోచని పరిస్థితి. కనీసం పంట పెట్టుబడికి పెట్టిన ఖర్చులు కూడా రావని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీన్ని ఆసరాగా చేసుకొని దళారులు రైతుల నుంచి తక్కువ ధరకు పంటను కొనుగోలు చేస్తున్నారు. చివరికి రైతుకు నిరాశే మిగులుతోంది.

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో 78,583 హెక్టార్లలో ప్రధాన వాణిజ్య పంట అయిన వేరుశనగను సాగు చేశారు. సాగు చేసే సమయంలో క్వింటా వేరుశనగ ధర రూ.8 వేల వరకు పలికింది. క్వింటా విత్తనాన్ని రూ.12 వేలకు కొనుగోలు చేసి సాగుచేశారు. వరి, మొక్కజొన్న ధరలు కూడా పూర్తిగా పడిపోయాయి. ప్రారంభంలో మొక్కజొన్న క్వింటా ధర రూ.3 వేలు పలకగా ప్రస్తుతం క్వింటా ధర రూ.2వేల నుంచి రూ.2,200 లకు విక్రయిస్తున్నారు. పెట్టుబడి ఖర్చులు పెరిగినా సాగు చేసిన పంటలు గిట్టుబాటు కావడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో పంటల సాగు వివరాలు ఇలా..

నియోజకవర్గం పేరు	వరి (హెక్టార్లలో)	వేరుశనగ	మొక్కజొన్న (హెక్టార్లలో)
రాయదుర్గం	10,493	28,843	5,676
కళ్యాణదుర్గం	200	30,112	1,100
ఉరవకొండ	1,275	20,228	1,699
మొత్తం	11,968	78,583	8,475

పంట సాగుకు అయ్యే ఖర్చు అధికం..

ప్రధాన వాణిజ్య పంట వేరుశనగ, వరి సాగు చేయడానికి హెక్టారుకు రూ.లక్ష వరకు వస్తుంది. విత్తనాలు, దుక్కిచేయడానికి, రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు, కోత, కలుపు ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. మొక్కజొన్న సాగు చేయడానికి హెక్టారుకు రూ.60 వేల నుంచి రూ.75 వేల వరకు పెట్టుబడి ఖర్చులు అవుతున్నట్లు రైతులు చెప్తున్నారు. రైతుల పండించిన మొక్కజొన్న, వేరుశనగ, వరి ధాన్యాలను కర్ణాటకలోని బళ్లారి, చెళ్లికెర మార్కెట్లకు తరలించి విక్రయిస్తుంటారు. కొందరు స్థానికంగా దళారులకు విక్రయిస్తారు. ధరలు తగ్గుముఖం పట్టడంతో దళారులు ఇష్టారాజ్యంగా ధరలు ఇచ్చి, రైతులకు అన్యాయం చేస్తున్నారు.


కళ్లాల్లో ఉంచిన వరి ధాన్యం


వరి ధాన్యాన్ని తూకం వేస్తున్న దృశ్యం

రూ.90 వేల అప్పు మిగిలింది



2.50 ఎకరాలో వేరుశనగ పంట సాగు చేశా. సాగు చేసే సమయంలో వేరుశనగక్వింటా రూ.7 వేల నుంచి రూ.8 వేల వరకు ఉండేది. ఈసారి అప్పులు తీరి పోతాయని పంటను చూసి మురిసిపోయాం. పంట కాలం పూర్తయ్యే సరికి ధరలు పడిపోయాయి. వేరుశనగ కాయలను తొలగిస్తే ఆరు బస్తాలకు 1.80 క్వింటా అయ్యింది. మార్కెట్‌లో క్వింటాలు రూ.5,100కు విక్రయిస్తే రూ.9,180 చేతికి వచ్చింది. రూ.లక్ష వెచ్చించినా ఖర్చులు కూడా రాలేదు. రూ.90 వేలు అప్పు మిగిలింది.
– జి.వీరారెడ్డి, రైతు, బీటీపీ గ్రామం

తక్కువ ధరకు అడుగుతున్నారు



మాకున్న 3 ఎకరాల పొలంలో వరి సాగు చేశాం. పెట్టుబడి ఖర్చులు విపరీతంగా పెరిగాయి. వర్షాలు పడడంతో పంట బాగా చేతికి వచ్చి ధరలు నిలకడగా ఉంటాయని భావించాం. రైతు ఇంటికి ధాన్యం చేరే సమయానికి ధరలు పడిపోవడంతో నష్టాలు చవిచూడాల్సి వచ్చింది. పంట సాగు చేసే సమయంలో క్వింటా ధర రూ.3 వేల నుంచి రూ.3,200 వరకు ఉండేవి. ప్రస్తుతం క్వింటా ధర రూ.2,100 నుంచి రూ.2,250 విక్రయిస్తున్నారు.
– తిమ్మారెడ్డి, రైతు, కలుగోడు గ్రామం

రైతాంగాన్ని ఆదుకోవాలి



వ్యవసాయం రంగాన్ని ప్రభుత్వం ప్రోత్సహించి, అన్ని విధాలుగా రైతులను ఆదుకోవాలి. రైతులు పండించిన పంటలను ప్రభుత్వమే గిట్టుబాటు ధరతో కొనుగోలు చేయాలి. రైతులకు అందించే పథకాలు వంద శాతం సబ్సిడీతో అందించాలి. వరి, మొక్కజొన్న, మిరప, వేరుశనగ ధరలు పూర్తిగా పడిపోయాయి. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసి అన్ని విధాలుగా ఆదుకుంది.
– మెట్టు గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, రాయదుర్గం

దళారులను నమ్మి మోసపోవద్దు..



వేరుశనగ, వరి, మొక్కజొన్న పంటలు ఒకేసారి చేతికి వచ్చాయి. ప్రస్తుతం ధరలు తగ్గుముఖం పట్టాయి. మద్దతు ధర కల్పించే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ధరలు తక్కువగా ఉన్నాయని దళారులు మోసం చేసే అవకాశం ఉంది. దళారులను నమ్మి ఎవరూ మోసపోవద్దు. రైతులు బహిరంగ మార్కెట్‌లో వేరుశనగ, వరి, మొక్కజొన్న పంటలు విక్రయించాలి.
– లక్ష్మానాయక్, ఏడీఏ రాయదుర్గం

కర్ణాటక మద్యం రవాణాపై నిఘా ఉంచాలి

- జిల్లా ఎక్సైజ్ శాఖ డీసీ నాగమద్దయ్య

కంబదూరు: కర్ణాటక మద్యం రవాణా, నాటుసారా తయారీ, బెల్టుషాపులు నిర్వహించినా చర్యలు తప్పవని జిల్లా ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య హెచ్చరించారు. శనివారం కంబదూరు ఎక్సైజ్ పోలీసు స్టేషన్ ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి, సీఐ సునీల్‌కుమార్, జయనాథ్‌రెడ్డి, ఆలీబేగ్, ఎస్ ఐలు రాజేంద్రప్రసాద్, శ్రీనివాసులు పాల్గొన్నా రు.

కుందుర్పి: వెంకంపల్లి చెక్‌పోస్టు వద్ద 290 కర్ణాటక టెట్రా మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. శనివారం కర్ణాటక నుంచి మందపల్లికి గంగాధర్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై మద్యం ప్యాకెట్లు తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు.

కంబదూరు: కంబదూరు, కుందుర్పి, శెట్టూరు మండలాల్లో సీఐ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో దాడులు చేసి, 420 కర్ణా టక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు శనివారం తెలిపారు.

నిత్యావసర సరుకులు సక్రమంగా అందించాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ మునివేలు

బొమ్మనహాళ్: ప్రజలకు అందించాల్సిన నిత్యావసర సరుకులను సక్రమంగా అందించాలని తహసీల్దార్ మునివేలు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రేషన్ డీలర్ల సమావేశం నిర్వహించారు. రేషన్‌కార్డులు కలిగిన లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని, ఎలాంటి ఇబ్బందులు కలిగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రికార్డులు సక్రమంగా నమోదు చేయాలన్నారు. డీడీలను సకాలంలో తీయాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ బాలకృష్ణ, డీలర్ల సంఘం అధ్యక్షుడు పయ్యావల మోహన్‌బాబు , డీలర్లు పాల్గొన్నారు.

సర్వర్ సతాయింపు

కూడేరు: స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో ఆధార్ ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అయితే సర్వర్ సతాయిస్తుండడంతో ఆధార్ అప్‌డేషన్ ముందుకు సాగడంలేదు. శనివారం కూడా సర్వర్ సమస్య తలెత్తింది. దీంతో పిల్లలు సెంటర్ వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది.

ఇళ్ల వద్దకే వెళ్లి అవగాహన కల్పించండి


బీఎల్‌ఓలతో మాట్లాడుతున్న రిటర్నింగ్ ఆఫీసర్ ఆనంద్ బాబు


రాయదుర్గంలో ఓటరు నమోదును పరిశీలిస్తున్న అధికారులు

కూడేరు: బూత్ లెవల్ పరిధిలో ఇళ్ల వద్దకే వెళ్లి ఓటరు నమోదుపై ప్రజలకు అవగాహన కల్పించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ ఆనంద్‌బాబు ఆదేశించారు. శనివారం ఆయన కూడేరు, జల్లిపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో జరుగుతున్న ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియను ఆయన తనిఖీ చేశారు. ఓటరు జాబితాలో చేర్పులు, మార్పుల కోసం ఎన్ని దరఖాస్తులు వచ్చాయని బూత్‌లెవల్ ఆఫీసర్లు (బీఎల్‌ఓ)తో ఆరా తీశారు. కార్యక్రమంలో డీటీ సూర్య ప్రతాప్, వీఆర్‌ఓ లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటరు నమోదులో 135 క్లెయిమ్‌ల స్వీకరణ

రాయదుర్గంటౌన్: నియోజకవర్గ వ్యాప్తంగా ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ ఈఆర్‌ఓ వెంకటేశ్వర్లు సూచించారు. తొలిరోజు శనివారం తహసీల్దార్ నాగరాజు, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, ఈడీటీ సుజాతతో కలిసి పట్టణంలోని డాక్టర్ రాధాకృష్ణ మున్సిపల్ హైస్కూల్, జెడ్పీ బాలికోన్నత పాఠశాలలోని పోలింగ్ బూత్‌లలో ఓటరు నమోదును క్షేత్ర స్థాయిలో పరిశీలించి, బీఎల్‌ఓలతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలోని రాయదుర్గం పట్టణం, రూరల్, గుమ్మఘట్ట, బొమ్మనహాళ్, కణేకల్లు, డి.హీరేహాళ్ మండలాలలోని 296 పోలింగ్ బూత్‌ల నుంచి 135 క్లయిమ్‌లు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు.

ప్రత్యేక ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోండి

కంబదూరు: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ స్టేషన్‌లో ప్రారంభించిన స్పెషల్ క్యాంపును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బాలకిషన్ సూచించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 23,24 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు మండల వ్యాప్తంగా ఉన్న పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రికార్డులు పక్కాగా నిర్వహించండి

వజ్రకరూరు: అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పక్కాగా నిర్వహించాలని సర్పంచు మోనా లిసా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి సూచించారు. శని వారం స్థానిక ఎనిమిదో అంగన్‌వాడీ కేంద్రాన్ని వారు సందర్శించారు.

పంటలకు బీమా ప్రీమియం చెల్లించండి

బొమ్మనహాళ్: రబీ సీజన్‌లో వివిధ పంటలు సాగు చేసిన రైతులు ఈక్రాప్ నమోదు చేసుకొని, పంటల బీమా ప్రీమియం చెల్లించాలని ఏఓ సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

కళ్యాణదుర్గం: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలని కళ్యాణదుర్గం అర్బన్ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ కృష్ణ సూచించారు. శనివారం పట్టణంలోని శ్రీ చైతన్య ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో సేవ్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ర్యాలీ చేశారు. స్థానిక పాఠశాల నుంచి అర్బన్ పోలీసు స్టేషన్ వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. ప్రిన్సిపాల్ ఫిలిప్ కుమార్, డీన్ తిప్పారెడ్డి, ఇన్‌చార్జ్ లీలావతి, హేమలత, పీఈటీ అశోక్, సిబ్బంది హరి, ఉపాధ్యాయుడు మారెప్ప, డ్యాన్స్ మాస్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.

రబీ వేరుశనగ కోసం దరఖాస్తు చేసుకోండి

కుందుర్పి: మండలంలో రబీ సీజన్‌లో పంట సాగు చేసే రైతులు విత్తనకాయల కోసం ఆర్‌బీకేల్లో దరఖాస్తు చేసుకోవాలని ఏఓ మహేష్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

సంక్షిప్త సమాచారం

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బొమ్మనహాళ్: ఉంతకల్లు గ్రామానికి చెందిన హనుమంతు (58) బళ్లారి విమ్స్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఈనెల 21న దర్గాలో జరిగిన ఉరుసుకు వెళ్లి తిరిగి వెళ్తుండగా కల్లుదేవనహళ్లి వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి హనుమంతు గాయపడ్డాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నబీరసూల్ తెలిపారు.

తెగుళ్లతో అప్రమత్తంగా ఉండాలి

కుందుర్పి: రైతులు రబీ పంటల సాగులో భాగంగా వివిధ రకాల పంటలకు సోకే తెగుళ్లతో అప్రమత్తంగా ఉండాలని ఏఓ మహేష్ సూచించారు. శనివారం మండలంలోని తమ్మయ్యదొడ్డి, మాయదార్లపల్లి, బసాపురం గ్రామాల్లో క్షేత్రస్థాయి సందర్శనలో భాగంగా వివిధ రకాల పంటలను పరిశీలించారు.

బోరంపల్లిలో ఘర్షణ

కళ్యాణదుర్గం రూరల్: బోరంపల్లిలో పాతకక్షల నేపథ్యంలో శనివారం ఘర్షణ జరిగింది. గ్రామానికి చెందిన చాకలి యువరాజ్, హనుమంతు గాయపడ్డారు. పోలీసులు, గ్రామస్తుల వివరాల మేరకు.. ఆనంద్, చాకలి యువరాజ్ అనే ఇద్దరికి చిన్నపాటి ఘర్షణ జరిగింది. చాకలి యువరాజ్, హనుమంతు ఇంట్లో ఉండగా, అదే గ్రామానికి చెందిన కురుబ ఆనంద్, మనోహర్, కుమార్, సతీష్, తిప్పేస్వామి, రామాంజనేయులు, తిప్పన్న, జయరాం దాడిచేశారు. ఈ దాడిలో గాయపడిన హనుమంతు, యువరాజ్‌ను మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు.

మైలాపురంలో కుక్కలు స్వైర విహారం

బొమ్మనహాళ్: మైలాపురం గ్రామంలో శనివారం కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులుగా సంచరిస్తూ నడిచి వెళ్లేవారిపైనా, వాహనదారులపైనా, పశువులపైనా దాడులు చేస్తున్నాయి. దీంతో ప్రజలు వాటిని చూస్తేనే బెంబేలెత్తిపోతున్నారు. కుక్కలు గ్రామంలో ఉన్న గేదె చెవి కొరికి గాయపరిచాయి. మరికొందరిపైనా దాడి చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

వెంకటాంపల్లి వీఆర్వోకు తీవ్రగాయాలు

వజ్రకరూరు: వెంకటాంపల్లి వీఆర్‌ఓ ముత్యాలు తలకు తీవ్ర గాయాలయ్యాయి. వీఆర్వో పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. గ్రామానికి చెందిన హీరాల ఆనంద్ ఇంటి వద్ద సచివాలయ సర్వేయర్ వంశీకృష్ణ,వీఆర్‌ఓ కొలతలు వేస్తుండగా, పక్కనే ఉన్న హీరాల అర్జున్, అతని కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగి, దాడి చేసుకున్నారు. దాడిలో వీఆర్‌ఓ తలకు తీవ్ర గాయాలయ్యాయి.

ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలం ఇవ్వాలి

బొమ్మనహాళ్: ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇంటి స్థలాలు ఇచ్చి, గృహాలు మంజూరు చేయాలని సీపీఐ తాలుకా కార్యదర్శి నాగార్జున , రైతు సంఘం తాలుకా అధ్యక్షుడు తిప్పేస్వామి, నరసింహులు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని బొల్లనగుడ్డం లో ఇల్లు లేని వారితో అర్జీలు స్వీకరించి, స్థానిక గ్రామ సచివాలయంలో అధికారులకు అందించారు. సీపీఐ మండల ఇన్‌చార్జ్ కోట్రేష్, నాయకులు దుగ్గన్న, అర్జున్, బసిరెడ్డి, సుధాకర్, రామాంజి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సర్పంచు మెరుగైన వైద్యం కోసం సాయం



సర్పంచ్ గాదిలింగకు చెక్కును అందిసున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బొమ్మనహాళ్: ప్రతి కార్యకర్తకూ పార్టీ అండగా ఉంటుందని, సర్పంచు గాదిలింగ వైద్యం కోసం సాయం అందినట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామాంజనేయులు తెలిపారు. ఇటీవల బొల్లనగుడ్డం సర్పంచ్ గాదిలింగ ద్విచక్రవాహన ప్రమాదంలో గాయపడ్డాడు. దీంతో పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, సమన్వయకర్త మెట్టుగోవిందరెడ్డి గాదిలింగను పరామర్శించి, పార్టీ నుంచి సాయంఅందేలా చూస్తామని హామీ ఇచ్చారు. పార్టీ కార్యాలయం నుంచి వచ్చిన రూ.50వేల చెక్కును మండల కన్వీనర్ రామాంజినేయులు, నాయకులు ఎంసీహెచ్ రాజ్‌కుమార్, లోకేష్, వైస్ ఎంపీపీ కందేపల్లి రమేష్ ఆధ్వర్యంలో సర్పంచ్ గాదిలింగకు అందచేశారు. అలాగే ఎంసీహెచ్ రాజ్‌కుమార్ ఆస్పత్రి ఖర్చులకు రూ. 10 వేలు అందించారు. కార్యక్రమంలో నాయకులు వన్నూరుస్వామి, వెంకటేశులు, వీరన్నగౌడ్, వన్నూరుస్వామి, బసవరాజు, వంశీ, లింగదహాళ్ శీన తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం


నేమకల్లు ఆంజనేయస్వామి


అలంకరణలో సీతారామస్వామి


శ్రీరంగాపురంలో వార్షికోత్సవ పూజలు

బొమ్మనహాళ్: మండలంలోని శ్రీరంగాపురం క్యాంపులో ఆంజనేయస్వామి ఆలయ 25వ వార్షికోత్సవ పూజలు శనివారం ఘనంగా ప్రారంభించారు. గంగాజలంతో అభిషేకించి గణపతి పూజ, నవగ్రహ పూజ 101 కలశాల పూజలతో ప్రారంభించారు. అనంతరం ధ్వజారోహణం, అభిషేకం, హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.భక్తులకు అన్న దానం చేశారు. ఆదివారం, సోమవారం కూడా పూ జ లు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపా రు.

నేమకల్లు అంజన్నకు కార్తీకమాస పూజలు

ప్రసిద్ధి చెందిన నేమకల్లు ఆంజనేయస్వామి దేవాలయంలో నాల్గో శనివారం కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి మూలవిరాట్‌ను పట్టువస్త్రాలతో, పుష్పాలతో శోభాయమానంగా అలకరించారు. కర్ణాటక, ఆంధ్రా ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు వచ్చి స్వామిని దర్శించుకున్నారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. కార్తీక మాసం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో దీపాలను వెలిగించారు.

వజ్రకరూరు: స్థానిక బలిజవీధిలోని సీతారామస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, మంగళహారతి, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. జనార్దన వేంకటేశ్వరస్వామి ఆలయంలోనూ పూజలు చేశారు.

శెట్టూరు: కార్తీక శనివారం పురస్కరించుకొని పురాతన ఆలయం కమతనహళ్లి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి సంబంధించిన ఎర్రబాపు కుటుంబ సభ్యులు ఆలయంలో ఆకుపూజ చేశారు. అన్నదానం చేశారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయి జయంతి


ఉరవకొండలో భజనలు చేస్తున్న దృశ్యం

ఉరవకొండ: ఉరవకొండలోని దివ్యక్షేత్రంలో భగవన్ సత్యసాయిబాబా జయంతి వేడుకలు శనివారం నిర్వహించారు. స్థానిక అవతార ప్రకటన క్షేత్రంలో బాబా తనను తాను సత్యసాయిగా ప్రకటించుకున్న రాతి గుండు వద్ద జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన భక్తుల ఆధ్వర్యంలో భజనలు చేశారు. అనంతరం జిల్లా స్థాయి వ్యాసరచన, వకృత్వపు పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. పేదలకు అన్నదానం చేశారు.

బెళుగుప్ప: స్థానిక సత్యసాయి భజన మందిరంలో సత్యసాయి సేవాసమితి, మండల సేవా కమిటీ సభ్యులు భగవాన్ సత్యసాయి జయంతి వేడుకలు నిర్వహించారు. స్వామి పాదుకలు, స్వామి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. బెళుగుప్ప భజన మందిరం వద్ద సత్యసాయి సేవాదళ్ సభ్యులు 99 మంది వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు.

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్లకు చెందిన సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు జయన్న, భీమేష్ ఆధ్వర్యంలో సత్యసాయి జయంతి వేడుకలు శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా 120 మంది పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. మరో 50 మందికి చీరలు, జాకెట్లు పంపిణీ చేశారు. సాయంత్రం ట్రాక్టర్‌లో బాబా చిత్రపటం ఉంచి ఊరేగింపు నిర్వహించారు.


కొనకొండ్లలో నోటు పుస్తకాలు, స్వీట్లు అందిస్తున్న దృశ్యం


సత్యసాయి భజన మందిరం వద్ద చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

మూడు ట్రాక్టర్లు, జేసీబీ సీజ్


సీజ్ చేసిన ట్రాక్టర్లు, జేసీబీ

కూడేరు: గొటుకూరు పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూముల్లో కొందరు టీడీపీ నాయకులు అక్రమంగా తవ్వకాలు చేపట్టి వెంచర్లకు తోలి సొమ్ము చేసుకుంటున్నారు. శుక్రవారం రాత్రి పొద్దుపోయాక రామచంద్రాపురం చెరువులో జేసీబీ ద్వారా మూడు ట్రాక్టర్లతో బ్రాహ్మణపల్లి వద్దనున్న వెంచర్‌కు మట్టి తరలిస్తున్నట్లు విజిలెన్స్ అధికారుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు రంగంలోకి దిగి అడ్డుకున్నారు. చెరువు వద్దకు వెళ్లి మూడు ట్రాక్టర్లు, ఒక జేసీబీని సీజ్ చేసి, వాటిని కూడేరు పోలీసు స్టేషన్‌కు తరలించారు.